thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 119| జగిత్యాల | బుధవారం 29 జూలై, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### షాట్ పుట్‌లో స్వర్ణం





# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం

- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోరులు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటన లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట, బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.



# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు.. పది కోట్ల జరిమానా
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

# ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి



- అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య
- గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి
- కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 2లో..

# 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



## రాజకీయ నైతికతకు ప్రతీక జైపాల్ రెడ్డి

వివరాలు 2లో..

# విద్యార్థులపై దమనకాండకు సమాధానం చెప్పండి



- దాడి చేయమని ఎవరు ఆదేశించారు?.. కేంద్రాన్ని నిలదీసిన ప్రియాంక గాంధీ
- యువత ఆకాంక్షలను ప్రధాని మోదీ పట్టించుకోవడం లేదని విమర్శ

4

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ అరెస్ట్

అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు



2

సహచర ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తరలించారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

- ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి
- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు 2లో..



# తుది దశకు చేరుతున్న సర్ ప్రక్రియ

- ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై అధికారుల దృష్టి
- డిజిటలైజేషన్‌కు అడ్రస్ మార్పులు, అందుబాటు సమస్యలు అడ్డంకి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి అడ్రస్‌లను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సహా అందరూ ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు.

2





# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3

# నీట్ నిరసనకారులకు భారీ ఊరట



- మైనర్లు, నేరచరిత్ర లేని విద్యార్థులను విడుదల చేయాలి: సుప్రీంకోర్టు
- కేసుల ఉపసంహరణకు బిహార్, అస్సాం నిర్ణయం.. రాజస్థాన్ కూడా సిద్ధం

4

# హామీల అమలులో కమిటీలదే కీలక పాత్ర

- హామీలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వారితే
- స్పీకర్ ప్రసాద్ కుమార్

4



# కీలక బిల్లులుపై ఎన్డీఏ ఎంపీలతో మోడీ చర్చ

- పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం
- ఎన్డీఏ పక్ష ఎంపీలతో మంగళ్ మిలన్ భేటీ

4



చురకలు





# రాజకీయ నైతికతకు ప్రతీక జైపాల్ రెడ్డి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జూలై 28:** రాజకీయాల్లో నైతికతకు ప్రతీక కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డివర్ధంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆయనచిత్రపటానికిపూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి నాయకునిగాప్రస్థానం ప్రారంభించిన జైపాల్ రెడ్డి తన తుది శ్వాస వరకువిలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని సీఎం పేర్కొన్నారు. తనవిషయపరిజ్ఞానం, వాగ్దాటితో అటు ప్రజలు, ఇటు పార్లమెంట్‌లోతనదైన ముద్ర వేసిన ఘనత జైపాల్ రెడ్డిదని సీఎం తెలిపారు. ఆయన ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడుమహేష్ గౌడ్, కాంగ్రెస్ నేతలు రోహిణ్ రెడ్డి, తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు.

# తుది దశకు చేరుతున్న సర్ ప్రక్రియ

**ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై అధికారుల దృష్టి**

**డిజిటలైజేషన్‌కు అడ్రస్ మార్పులు**

**అందుబాటు సమస్యలు అడ్డంకి**



**హైదరాబాద్, జూలై 28:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి అడ్రస్‌లను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సహా అందరూ ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ.. ఇంకా ఎన్యుమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనర్హం.వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా.. మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఇంటి అడ్రసులు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సమాచారం అందించి ఎన్యుమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సర్ పక్రియ ఆగస్టు 3వ తేదీన ముగుస్తుంది. కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యుమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతుంది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటువంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబర్ తీసుకొని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్‌లో భాగంగా వీరందరికి ఎన్యుమరేషన్ పత్రాలను జూన్ 25 వ తేదీన ప్రారంభించారు. ఈ క్రమంలో సర్ పక్రియ చివరి దశకు చేరుకుంది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ అరెస్ట్

**అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు**



**హైదరాబాద్, జూలై 28:** సహచర ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తరలించారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమిలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తును ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ బదిలీ చేశారు. అకాడమిలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా నిందితుడు పేర్కొన్న రెండు చిరునామాల్లోనూ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులకు అతడి ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు తాజాగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం..

- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూలై 28:** హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోరులు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట, బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

- అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య
- గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి
- కేసీఆర్ పెట్టిన ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు
- ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 28:** ప్రశ్నపత్రాలలీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలో జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపైమాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నా పత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేదిచూస్తామని సీఎం ఒక ప్రశ్నకుబదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనావటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షలవరకు విస్తరించి, వాటిని గందరగోళంచేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనులవిషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోపరిస్థితుల పరి శీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ. 8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలుచెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీవంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్ ట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ. 2,200 నుంచి రూ. 2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమంతప్పకుండా వాటిని చెల్లించేందుకు తమప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య ఉండదని సీఎం స్పష్టం చేశారు.

# 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

**సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ, జూలై 28:** తెలంగాణకు ప్రధానమంత్రిఆవాస్ యోజన–గ్రామీణ్ కింద 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాతపేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కృషి భవన్ లో ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగాఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గతపదేళ్లపేదలు సొంత ఇళ్లు నిర్మించుకోకపోవడంతో, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినసర్వేలో11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సీఎం తెలిపారు. సాధ్యమైనంతత్వరగాతెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. ల్‌నినోనేపథ్యంలోవికసిత్భారత్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)లో (వీబీ జీ రామ్ జీ) అదనపు పనులు చేర్చాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపాధులు మెరుగు పర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహానికి అదనపుపనులనుచట్టంలోచేర్చాలని సీఎం కోరారు.రైతులు తమ భూముల్లో కూరగాయలపందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయలతోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులనువీబీ జీ రామ్ జీలోచేర్చాలని కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకుకందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతోదెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు వీబీ జీ రామ్ జీలోచేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. ఉపాధి హామీ పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో90 రోజుల వరకు పనులు చేసే అవకాశం ఉండేదని సీఎం తెలిపారు. వీబీ జీ రామ్ జీ లోనూ అందుకు అనుమతి ఇప్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి కోరారు. స్థానిక అవసరాలకుతగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే ఇతర పనులను విబీ జీ రామ్ జీలోచేర్చాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ÷ుఖ్యమంత్రి వెంట ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేంనరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, సెక్టరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ ఉన్నారు.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

**ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి**

**రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**

**హైదరాబాద్, జూలై 28:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ–సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మీక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ–సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ–సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ–సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ–సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ–సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడ తాయని తెలిపారు. రీ–సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ–సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై పొంగులేటి ఆరా

హైదరాబాద్, జూలై 28: మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరా తీసారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిని పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

- గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే
- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**న్యూఢిల్లీ, జూలై 28:** మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త బిల్లులు తీసుకురావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా మూడుసార్లు జరిగాయని వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత, దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. నిన్న హైకోర్టు హైడ్రా అనేది 9 తలల విష సర్పం అని చెప్పింది. ముఖ్యమంత్రి ఇంతకంటే చెంపపెట్టు ముఖ్యమంత్రికి ఏముంటుంది.. సిగ్గుండాలని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులతోపాటు పలు ఐటీ సంస్థల అంశాలను కేంద్రమంత్రితో చర్చించారు. అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావుతో కలిసి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. బడాబాబులను మాత్రం వదిలిపెట్టి గరీబోళ్ల ఇండ్ల మీద పడి.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఇల్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెరువులో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర మంత్రులు వివేక్, శాసనమండలి చైర్మన్ గుత్తు సుఖేందర్ రెడ్డి, రాష్ట్రంలో ఇంకా కీలక నేతలు చాలా మంది బిల్డింగులన్నీ చెరువుల్లో, శిఖాల్లో ఉన్న వాటిని మాత్రం హైడ్రా ముట్టదని కేటీఆర్ అన్నారు. కబ్జాకోరులని ముఖ్యమంత్రి అంటున్నరు. అందరికంటే పెద్ద కబ్జాకోరులే మీ అన్నదమ్ములు కదా.. అందరికంటే ఎక్కువ ఆస్తి దోస్తున్నది.. అందరికంటే ఎక్కువ విధ్వంసం చేస్తున్నది మీ మంత్రులు కదా? కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టింది నీ మంత్రులు కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయిన నాడు రాష్ట్రంలో నిషేధిత భూముల ఎంతంటే మొత్తం 16 లక్షల ఎకరాలు.. ఇవాళ అది కోటి ఎకరాలకు చేరుకుంది. ఏ కారణం చేత కోటి ఎకరాలు పెడుతున్నరు. 30 శాతం కమిషన్ తీసుకోవడం లేదా? మీ మంత్రులు.. అని ప్రశ్నించారు. కబ్జాకోరులు, భూదందాలు చేసేది.. భూమిని భూహారతిలాగా మింగుతున్నది నీ ప్రభుత్వం, నీ మంత్రులు కాదా? ప్రజలకు తెల్వదా? అని అన్నారు. హైడ్రా పేరుతో నువ్వు సృష్టిస్తున్న అరాచకం కొన్ని వేల ఇండ్లు హైదరాబాద్‌లో కూలగొట్టి ఒక ఇటుక పెట్టకుండా.. ఇల్లు కట్టకుండా విధ్వంసం సృష్టించి రియల్ ఎస్టేట్‌ను సృష్టించి నువ్వు డబ్బులు సొమ్ము చేసుకుంటున్నవ్ అంటూ మండిపడ్డారు. పెద్ద పెద్ద బిల్డర్లు ఇవాళ చెరువుల్లో ఇండ్లు, బిల్డింగులు కడుతుంటే నీకు కనబడదు. కానీ ఇవాళ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నవ్. అందుకే మేమనేది హైడ్రా అనేది బ్లాక్‌మెయిలింగ్ ఎక్స్‌టార్షన్ టూల్ ఆఫ్ రేవంత్ రెడ్డి. అందుకే మా ప్రభుత్వం వచ్చిన మొదటి రోజే హైకోర్టు చెప్పిన విధంగా దాన్ని ఎత్తి బంగాళాఖాతంలో పడేస్తామన్నారు. ఒక అధికారి 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు చరిత్రలో ఎక్కడైనా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సోదరుడి ఇల్లు, కాంగ్రెస్ నాయకుల ఫామ్ హౌసులు ఎందుకు కూలగొట్టడం లేదు? చెప్పాలని డిమాండ్ చేశారు.




# సమస్యల పరిష్కారం కోసం పోరుబాట

## జంతర్ మంతర్ వద్ద జర్నలిస్టుల ఆందోళన

**న్యూఢిల్లీ, జూలై 28:** జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు ఢిల్లీ జంతర్ మంతర్‌లో ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ధర్నాలో మాట్లాడారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని, పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్రం తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నగరంలో భారీ వర్షం

## లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం

## ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

**హైదరాబాద్, జూలై 28:** గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొంపల్లి, ఓల్డ్ సిటీ, అంబర్‌పేట్, కాచిగూడ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం పడటంతో రహదారులపై భారీగా నీరు నిలిచింది. పలుచోట్ల వాహనాలు ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి, ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమ్జగ్గ÷న్సీ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించగా, వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

# హామీల అమలులో కమిటీలదే కీలక పాత్ర

- హామీలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వారితే
- హామీల అమలు కమిటీల సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్



**హైదరాబాద్, జూలై 28:** పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ హామీల అమలు కమిటీల పాత్ర చాలా గొప్పదని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విదంగా చూడాల్సిన బాధ్యత హామిాల కమిటీదని అన్నారు. ఆవిధంగా పనిచేయాలని సూచిస్తున్నాను. నియామాల కమిటీ శాసనసభ సక్రమమైన, సమర్ధవంతమైన, ప్రజాస్వామ్య బద్ధమైన నిర్వాహణలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుందన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో మంగళవారం శాసనసభ ప్రభుత్వ హామిాల అమలు కమిటీ, శాసనసభ యొక్క నియమాల కమిటీ, శాసనసభ నైతిక విలువల కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. శాసన సభాపతిగడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణలు హాజరయ్యారు. రూల్స్ కమిటీ సమావేశానికి కమిటీ సభ్యులు దానం నాగేందర్, తూడి మెఘారెడ్డి, భూక్యా మురళి నాయక్, హాజరయ్యారు. శాసనసభ నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు మధుసూదన్ రెడ్డి, కౌన్సిల్ సెక్రటరీ నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. శాసనసభ చట్టాల ద్వారానే కాకుండా ఆ చట్టాలను రూపొందించే సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహార శైలి ద్వారా కూడా అంచనా వేయబడుతుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల నమ్మకాన్ని బలోపేతం చేయడం అనే ఉద్యేశ్యంతోనే ప్రపంచవ్యాప్తంగా పార్లమెంటరీ వ్యవస్థలో నైతిక విలువల కమిటీ అనే వ్యవస్థ అభివృద్ధి చెందింది. రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా కమిటీలు పనిచేయాలి. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. శాసనసభలో సభ్యులకు మొదటిగా ఇచ్చేది రూల్స్ బుక్, దానికి అనుగుణంగా స్పీకర్ శాసనసభను నడుపుతారన్నారు. గత ప్రభుత్వంలో రూల్స్ బుక్‌ను మార్చివేశారు. శాసనసభను సమర్ధవంతంగా నడపడానికి కమిటీ అధ్యక్షులు, సభ్యులు కలిసి నూతన నిబంధనలతో రూల్స్ బుక్‌ను రూపొందించాలి. శాసనసభ కమిటీలు ఇతర రాష్ట్రాలలో కూడా స్టడీ టూర్ చేసి ఆయా రాష్ట్రాల శాసనసభలలో అమలవుతున్న నిబంధనలను పరిశీలించాలి, వారి సలహాలు తీసుకోవాలని నా సూచన అని అన్నారు. సభలో నియమాలను పాటించే విదంగా చూడడంతో పాటుగా, సభ హుందాతనాన్ని కాపాడడంలో విలువల కమిటీది కీలక పాత్ర అన్నారు. కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్‌గా ఉండే విదంగా ఎథిక్స్ కమిటీ సూచనలు ఉండాలన్నారు. కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ.. శాసనసభ మాపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తూ సభ గౌరవాన్ని పెంచుతామని తెలిపారు.

# ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

## ప్రమాదంలో యువతీ,యువకుడు మృతి

**హైదరాబాద్, జూలై 28:** నగరంలోని గచ్చిబౌలి ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నియోపోలిస్ ఎగ్జిట్ సమీపంలో రోడ్డుపక్కన నిలిచి ఉన్న లారీని.. వెనుక నుంచి అత్యంత వేగంగా వచ్చిన స్విఫ్ట్ కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న యువతీ, యువకుడు వాహనంలోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఎంతో శ్రమించి వారిని బయటకు తీశారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంతో ఔటర్ రింగ్ రోడ్డుపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మృతులను యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కత్రావత్ సురేందర్ (19), ప్రణీతి రెడ్డిగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ ఒకే గ్రామానికి చెందినవారని, ప్రణీతి ఎల్‌బీనగర్‌లోని ఏస్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిగా సమాచారం. సోమవారం రాత్రి యాదాద్రి జిల్లా బొమ్మలరామారం నుంచి గండిపేట్ మీదుగా కొల్లూరు వైపు కారులో బయలుదేరిన సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

- ప్రజలు స్వాగతిస్తుంటే..వీరు విమర్శిస్తున్నారు
- నీట్‌పై కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్, జూలై 28:** హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ ప్రక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్-జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్-జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

## కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం

బీఆర్ఎస్ పాలనపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత క్షమాపణలు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గత పాలకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలని కవితకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాడారు. బీఆర్ఎస్ నేతలు డబుల్ 420 అని అభివర్ణించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామన్నారు. అసెంబ్లీకి వస్తే ఆయన మర్యాదకు ఇబ్బంది రానివ్వమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైడ్రా మంచిదని సాధారణ ప్రజలు చెబుతున్నారని తెలిపారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీ తీస్తున్నారని చెప్పారు. అయితే హైడ్రా విషయంలో హైకోర్టు తీర్పును గౌరవిస్తామని స్పష్టం చేశారు. తాము చెప్పాల్సింది కోర్టుకు చెబుతామని అన్నారు. రాజకీయం కోసమే హైడ్రాకు వ్యతిరేకమైన పిటిషన్లు వేస్తున్నారని ఆరోపించారు. హైడ్రాకి వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కోర్టు పూర్తి తీర్పు ఇంకా రాలేదని గుర్తు చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని తీసుకెళ్తోందంటూ బీఆర్ఎస్ పార్టీపై మంత్రి శ్రీధర్ బాబు నిప్పులు చెరిగారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## ప్రజావాణిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 28:** ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2ఃఊఐ గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార పక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## సంపాదకీయం



# హైడ్రా దూకుడుకు హైకోర్టు కళ్లెం!

హైడ్రా తీరు, కమిషనర్ రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. దీనిపై సమీక్షించుకోవడం, ఆత్మవిమర్శ చేయడం ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యంగా భావించాలి. పెద్దలను వదిలి పేదల ఇళ్లను కూలస్తున్నారన్న అపప్రథ రాగానే చర్యలు తీసుకుని ఉంటే ఇంతటి అపప్రథ వచ్చేది కాదు. కానీ సిఎం రేవంత్ పదేపదే హైడ్రాను సమర్థిస్తూ వచ్చారు. అయితే హైడ్రా వల్ల మంచి పనులు జరగలేదని చెప్పడానికి లేదు. ప్రభుత్వ భూముల కబ్జా, చెరువుల కబ్జాను తొలగించడం వంటి చర్యలను ప్రజలు సమర్థి÷-తూ వస్తూనే ఉన్నారు. కానీ పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చడాన్ని ఎవరూ సమర్థించరు. పేదలకు గూడు కట్టివాలనుకున్నప్పుడు వారు ఉన్న ప్రాంతాలను వారికే అప్పగించాలి. కానీ వారిని గూడులేని వారుగా చేయడం సరికాదు. హైదరాబాద్‌లోని జలవనరుల రక్షణ, అక్రమార్కుల కబ్జాలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణ పేరుతో ప్రభుత్వం గతేడాది జూలైలో జీవో 99 ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఫోర్స్-హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కాలంలో పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులను కాపాడిందనడంలో సందేహం లేదు. అయితే హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడం వంటి ఉల్లంఘనలు చెడ్డపేరు తెచ్చి పెట్టాయి. చట్టప్రకారం, నిబంధనల మేరకు నడుచుకుని ఉంటే ఇంతగా హైకోర్టు చేత చివాట్లు తినాల్సిన పని వచ్చేది కాదు. హైడ్రా చేస్తున్న పనులపై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్ట్ వరుసగా మొట్టికాయలు వేస్తూనే ఉన్నది. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు చెప్పడం ప్రభుత్వాని చెంపపెట్టుగానే భావించాలి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారం ముందు నుంచీ వివాదాస్పదంగానే ఉన్నది. బుల్డోజర్లను ఉపయోగిస్తూ ప్రభుత్వం సాగిస్తున్న కూల్చివేతల విషయంలో ఆయన తీరు పట్ల ప్రజాగ్రహం పెల్లుబుకుతున్నది. న్యాయస్థానాల ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడపట్ల విపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగనాథ్‌పై దాఖలైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తంచేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఆఫీస్ కోర్ట్ ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని, ఆయనను తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు ముందు కూడా రంగనాథ్ తీరు పట్ల హైకోర్ట్ పలుమార్లు మొట్టికాయలు వేసింది. ఇటీవలే ఆయన అరెస్ట్‌కు సైతం ఆదేశాలు ఇచ్చి, న్యాయవాదుల విజ్ఞప్తితో విరమించుకున్నది. హైడ్రా అరాచకాలు, రంగనాథ్ ఉల్లంఘనలపై హైకోర్ట్ చాలాసార్లు ఘాటుగానే స్పందించింది. హైడ్రా చర్యలు యుద్ధ పరిస్థితిని తలపించే చర్యలు అని అభివర్ణించింది. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం నమోదు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హైడ్రా చర్యలు సరైన దిశలో లేవని న్యాయమూర్తి స్పష్టంచేశారు. 2025 ఫిబ్రవరిలోనూ జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మరింత తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముత్తంగి గ్రామంలో ఓ షెడ్‌ను హైడ్రా కూల్చివేసిన తీరును దొంగలముఠా చర్యగా పోల్చింది. రాత్రిపూట రహస్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయని, చట్టపరమైన పక్రియను పాటించకపోతే హైడ్రాను మూసివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. ముందస్తు సమాచారం లేకుండా సెలవు రోజుల్లో ఎందుకు కూల్చివేతలకు పాల్పడుతున్నారని నిలదీసింది. హైడ్రా తీరుపై హైకోర్ట్ పదేపదే మొట్టికాయలు వేస్తున్నా, అధికారుల తీరును తప్పుబడుతున్నా ఆ సంస్థ యథేచ్ఛగానే వ్యవహరిస్తున్నది. దీనిపై ప్రభుత్వం కూడా జోక్యం చేసుకోక పోవడంతో హైకోర్టు ముందు దోషిగా న ఇలబడాల్సి వచ్చింది. లోతుకుంటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతల పర్వం పరాకాష్టగా చూడాలి. ఏవీ రంగనాథ్‌పై శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన మూడో ధిక్కార పిటిషన్ విచారణ సందర్భంగా జూలై 21న కోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది . కూకట్‌పల్లిలోని 13.17 ఎకరాల విస్తీర్ణంలో కూల్చి వేసిన నిర్మాణాలను హైడ్రానే పునరుద్ధరించాలని జూన్‌లో హైకోర్ట్ తేల్చిచెప్పింది. హైడ్రా దుస్సాహసాన్ని న్యాయస్థానం తీవ్రంగా ఖండిస్తున్నదని జస్టిస్ నాగేశ్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నాయని చెప్పినప్పటికీ రాత్రంతా కూల్చివేతలు జరుపడమేంటని నిలదీసింది. నిర్మాణాల పునరుద్ధరణకు అయ్యే ఖర్చును అధికారుల వ్యక్తిగత నిధుల నుంచి భరించాలని తేల్చిచెప్పింది. ఇది అరుదైన తీర్పు అని చెప్పవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ వృద్ధుడికి చెందిన వ్యవసాయ భూమిలో చేసిన విధ్వంసాన్ని కూడా జస్టిస్ విజయసేన్‌రెడ్డి ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. రంగనాథ్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. అడ్వకేట్ జనరల్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవడంతో ఆ ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నది. రంగనాథ్ స్వయంగా కోర్టుకు హాజరు కావాలని తేల్చిచెప్పింది. అదే రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు హైకోర్టులో విచారణకు రంగనాథ్ హాజరయ్యారు. అయితే ఆ తర్వాత కూడా హైడ్రా వ్యవహరించే తీరులో మార్పు రాలేదు. హైడ్రా చీఫ్ తానే ఒక చట్టంలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, అడ్వకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు సైనిక సిబ్బంది మోహరింపు ఉత్తర్వులను కూడా హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. జలవనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అంటూ హైడ్రా చెప్పుకొస్తున్నది. కానీ వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. హైడ్రా అంటే ఉదయం 4 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేసే సంస్థ అని పేరుమోసింది. కోర్ట్ ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా ధిక్కారణ ధోరణితో ప్రవర్తిస్తూ, ఆ ప్రవర్తననే విజయంగా ప్రచారం చేసుకొనే బృందంగా గుర్తింపు పొందింది. హైకోర్ట్‌లో 700కు పైగా కేసులు ఎదుర్కొంటున్న హైడ్రా, వివిధ కేసుల్లో విచారణల సందర్భంగా ధర్మాసనాలతో మొట్టికాయలు వేయించుకుంది. హైడ్రా రాజకీయంగా తటస్థంగా వ్యవహరించడంలేదని ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నది. అధికార పార్టీకి చెందిన నేతల అక్రమ కట్టడాలను హైడ్రా ఎందుకు కూల్చివేయడంలేదని విపక్షనేతలు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చట్టబద్ధమైన నిబంధనలు పాటించడంలేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, గడువు అడిగితే నిరాకరించడం, అప్పీల్‌కు అవకాశం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరం. కేవలం ప్రభుత్వ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టడం దారుణం. ఇప్పటికైనా హైడ్రా తీరు మారాలి. చట్టబద్ధంగా, నిబంధనల మేరకు నడుచుకుంటే మంచిది. పేదల పక్షాలన నిలబడాల్సిన అసవరం కూడా గుర్తించాలి.

# నీట్ నిరసనకారులకు భారీ ఊరట

- మైనర్లు, నేరచరిత్ర లేని విద్యార్థులను విడుదల చేయాలి: సుప్రీంకోర్టు
- కేసుల ఉపసంహరణకు బిహార్, అస్సాం నిర్ణయం.. రాజస్థాన్ కూడా సిద్ధం



**న్యూఢిల్లీ, జూలై 28:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులకు సుప్రీంకోర్టు కీలక ఊరటనిచ్చింది. 18 ఏళ్లలోపు మైనర్లు, ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అలాగే నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. ఇదే సమయంలో బిహార్, అస్సాం ప్రభుత్వాలు విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించగా, రాజస్థాన్ ప్రభుత్వం కూడా ఇదే బాటలో నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌తో పాటు పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులపై విచారణ చేపట్టిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని స్పష్టం చేసింది. విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్, దౌర్జన్యాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ధర్మాసనం, ఈ ఘటనలపై స్వతంత్ర విచారణ అవసరమని పేర్కొంది. నిర్దోషులపై దౌర్జన్యాలకు పాల్పడిన వారిని చట్టం వదిలిపెట్టదని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా నిరసనల సమయంలో పోలీసులు అనుసరించే విధానంపై కూడా సుప్రీంకోర్టు దృష్టి సారించింది. శాంతిభద్రతల నిర్వహణకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన ప్రామాణిక ప్రోటోకాల్ రూపొందించాలని సూచించింది. అలాగే గాయపడిన పోలీసుల భద్రతా చర్యలపై కూడా ప్రభుత్వాలను వివరణ కోరనున్నట్లు తెలిపింది. మరోవైపు నీట్ నిరసనకారులకు ఊరట కల్పిస్తూ బిహార్, అస్సాం ప్రభుత్వాలు విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించాయి. అస్సాం హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జూలై 26 వరకు నమోదైన ఐదు కేసుల్లో అరెస్టైన 13 మందిని సమీక్షించి విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై భవిష్యత్తులో ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండవని కూడా స్పష్టం చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు కూడా సానుకూల హామీ ఇచ్చినట్లు పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. అస్సాం, బిహార్ తరహాలోనే రాజస్థాన్‌లోనూ కేసుల ఉపసంహరణకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలతో దేశవ్యాప్తంగా నీట్ నిరసనల్లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలకు గణనీయమైన ఊరట లభించింది.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు.. పది కోట్ల జరిమానా
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్



**న్యూఢిల్లీ, జూలై 28:** భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయి-ఎమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# కీలక బిల్లులుపై ఎన్డీఏ ఎంపీలతో మోడీ చర్చ

- పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం
- ఎన్డీఏ పక్ష ఎంపీలతో మంగళ్ మిలన్ భేటీ



**న్యూఢిల్లీ, జూలై 28:** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని మోదీ విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ మంగళ్ మిలన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. సమావేశంలో ప్రధానంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (సవరణ) బిల్లు-2026 ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్‌లు, మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు. నేరస్థులకు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించడంతో పాటు, కేసుల వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించినట్లు సమావేశంలో చర్చించారు. ఇక భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను కూటమి ఎంపీలకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. భారత ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ ఒప్పందాలు కీలకంగా మారాయని ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. మత్స్యకారుల ఆదాయం పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ఎంపీలకు వివరించారు. మరోవైపు, జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యను ప్రశ్నిస్తూ సభను అడ్డుకుంటున్న విపక్షాలకు తగిన రీతిలో సమాధానం ఇవ్వాలని ఎన్డీయే నిర్ణయించింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

# విద్యార్థులపై దమనకాండకు సమాధానం చెప్పండి

**దాడి చేయమని ఎవరు ఆదేశించారు?.. కేంద్రాన్ని నిలదీసిన ప్రియాంక గాంధీ**

**యువత ఆకాంక్షలను ప్రధాని మోదీ పట్టించుకోవడం లేదని విమర్శ**

**న్యూఢిల్లీ, జూలై 28:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన దమనకాండకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు తీవ్రవాదులు కాదని, వారిపై లాఠీఛార్జ్ చేయాలని, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ ప్రయోగించాలని ఎవరు ఆదేశించారని సూటిగా ప్రశ్నించారు. దేశంలో ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్స్ జరిగినా ఒక్కరిపై కూడా కఠిన చర్యలు లేకపోవడం వల్ల విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో విద్యాశాఖ కేటాయింపులను తగ్గిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో పరీక్షా విధానం ఘోరంగా విఫలమైందని, ప్రధాని మోదీ మార్చుకోవాల్సింది కెమెరా యాంగిల్స్ కాదని.. తన మనసులోని యాంగిల్స్‌ను, సలహాదారులను మార్చుకోవాలని ప్రియాంక గాంధీ హితవు పలికారు.



## ఆసిఫాబాద్ నూతన సిఐ నీలం రవికి ఘన సన్మానం



**ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్ (సిఐ)గా బాధ్యతలు స్వీకరించిన నీలం రవిని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్‌లు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సిఐ నీలం రవికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాలం బిన్ అహ్మద్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బీన్ అబ్దుల్లా, పార్టీ నాయకులు సయ్యద్ నిసార్, దూడల అశోక్, షేక్ సమద్, సాయి శ్రవణ్, ఫహద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు అమూల్యం.. దరఖాస్తులో జాప్యం వద్దు

**మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్**



**ఆసిఫాబాద్ టౌన్:** ప్రజలెవరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ 'ఎస్ఐఆర్' (SIR) దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పోలింగ్ స్టేషన్ 216 లో 'ఎస్ఐఆర్' దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కౌన్సిలర్ రాపర్తి కార్తీక్, స్థానిక నాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో దరఖాస్తు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఆగస్టు 3 తేదీ లోపు దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి, సంబంధిత బిఎల్ఓ లకు త్వరితగతిన అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ కర్నె లక్ష్మీ, జూనియర్ అసిస్టెంట్ అభిషేక్, బీఆర్ఎస్ నాయకులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు రూ.3వేల గౌరవ వేతనం ఇవ్వాలి



**కాగజ్నగర్:** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు నెలకు రూ.3వేల గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వార్డు సభ్యులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న వార్డు సభ్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని, వారి ఆర్థిక భద్రత దృష్ట్యా నెలకు రూ.3వేల గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి, వార్డు సభ్యుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హామీని నిలబెట్టుకున్న సర్పంచ్

**విద్యార్థులకు విద్యా సామాగ్రి, క్రీడా కిట్ల పంపిణీ**



**జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. నాడు నిర్వహించిన బాలల గ్రామసభలో విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి, క్రీడా కిట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు, కంపాస్ బాక్సులతో పాటు వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆత్రం తిరుమల్లేశ్వర్, ఉపాధ్యాయులు జాయ్ లలిత, మంగరాణి, గ్రామ పెద్దలు అనకార్ అంజి పటేల్, సుదర్శన్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షా ల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలో వచ్చే 3 రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరం నుండి జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల అధికారులు, తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే 3 రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రాణహిత నదికి వరద వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ఎస్.డి.ఆర్.ఎఫ్. సిబ్బందిని అందుబా టులో ఉంచాలని, వాగులు, వంతెనల వద్ద సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని, ప్రజలు వాగుల వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, తహసిల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండే ప్రజలను ఎప్పటికప్పుడు జాగ్రత్త పరచాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని, సాగునీటి ప్రాజెక్టులలోకి వచ్చే ఇన్ఫ్లో పై నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమీక్షించుకోవాలని తెలిపారు. త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. సహాయక చర్యలలో భాగంగా కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.8500844365 నెంబర్ కు సమాచారం అందించాలని, భారీ వర్షాల హెచ్చరికల వల్ల అధికారులు స్థానికంగా ఉండాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు ఇబ్బందులు లేకుండా 2 రోజులలో పూర్తి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన గిరిజనులకు పింఛను మంజూరు పత్రాలు అందజేత

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్:**

తెలంగాణ జీవనోపాధుల పథకం క్రింద అర్హులైన గిరిజనులకు వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో తెలంగాణ జీవనోపాదుల ప్రాజెక్టు క్రింద జిల్లాలోని తిర్యాణి, లింగాపూర్ మండలాలలో ఎంపికైన గ్రామాలలోని అర్హులైన గిరిజనులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా



కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ జీవనోపాదుల పథకం క్రింద అర్హులైన గిరిజనులకు 100 శాతం పింఛన్లు, జాబ్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు అందించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గిరిజనుల ఆరోగ్యం, చిన్నపిల్లలకు టీకాలు, ఆహార భద్రతా కార్డులు, నైపుణ్యత శిక్షణ, ఆర్థిక అక్షరాస్యత పెంపుదలకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డి.పి.ఎం. రామకృష్ణ, సర్పంచ్ లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఓబిసిల ఉద్యమ ఫలితాలు అందుతాయి

- జెన్ జీల ఆలోచనతో ఓబిసిలు ముందుకు వెళ్లాలి
- ఢిల్లీ కేంద్రంగానే ఓబీసీల ఉద్యమాలు సాగించాలి
- ఢిల్లీ జంతర్ మంతర్ ధర్నాలో ఓబీసీ జాతీయ నాయకుడు తాడూరు శ్రీమాన్ వెల్లడి

**చురకలు ప్రతినిధి:న్యూ ఢిల్లీ**




చట్ట సభలలో ఓ బీసీలకు రిజర్వేషన్లు కేంద్రంలో ఓబీసీలకు మంత్రిత్వ శాఖ తప్పనిసరి చేయాలని సమయం ఆసన్నమైందని జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ వెల్లడించారు మంగళవారం ఓబిసి ఉద్యమంలో రెండో రోజు ఉద్యమ కార్యచరణలో భాగంగా భాగంగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుండి వందలాదిమంది ఓ బి సి ఉద్యమకారులతో పాటు బీసీ మహిళలు తరలిరాగా బీసీ నినాదాలతో జంతర్ మంతర్ హోరెత్తించినట్లు తాడూరి శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ కేంద్రంగా రెండో రోజు కార్యచరణలో భాగంగా తాడూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ 60 శాతం ఉన్న ఓబీసీలకు రాజ్యాంగపరంగా దక్కవలసిన వాటా దక్కడం లేదని పేర్కొన్నారు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఓబీసీలకు ఇస్తామని తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసపూరిత విధానాలతో బీసీలకు నష్టం చేస్తున్నారని ఆవేదన చెందారు అగ్రవర్ణ భావజాలం గల రాజకీయ పార్టీలకు ఓబీసీలు తాబేదారులుగా పని చేయాలని ఆలోచించుకోవడం సిగ్గుచేటని అన్నారు ఓబీసీ వర్గాలవారు ఓటు షేర్ ద్వారానే రాజ్యాధికారం సాధిస్తామని వెల్లడించారు దళితులను మరియు మైనార్టీలను కలుపుకొని బీసీ హక్కుల సాధనకై ఉద్యమ ప్రణాళిక రూపొందించేందుకు ఆర్ కృష్ణయ్య ముందు పడాలని తాడూరు శ్రీమన్నారాయణ సూచించారి. మంగళవారం జంతర్మంతర్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా నుండి 100 మంది బీసీ ఉద్యమకారులు పాల్గొని బీసీ చైతన్యం వెరిసెల నినాదాలు ఇస్తూ జంతర్ మంతర్ మారు మోగించారు వీరితో ఇతర ఉద్యమకారులు కోరస్ అందుకోవడంతో జంతర్మంతర్ బీసీల చైతన్యం ప్రపంచం ముందు చాటి చెప్పినట్లు అయిందని అన్నారు

## మొక్కల సంరక్షణే నిజమైన హరితహారం

**కాగజ్నగర్:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హారిక అన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వంజీరి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదిక ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కమ్యూనిటీ ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొక్కలు నాటి వాటికి నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కల సంరక్షణే నిజమైన హరితహారమని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. హరిత హారం లక్ష్యాలను విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి సంరక్షణకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ దత్తాత్రేయ, ఎంపీడీఓ ఉజ్వల్ కుమార్, ఏపీఓ చంద్రశేఖర్, టీఏ గులాబ్ సింగ్, గ్రామ సర్పంచ్ గౌత్రే లక్షి , ఉప సర్పంచ్ భారత్, గ్రామ కార్యదర్శి శ్వేతా రాణి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## జొన్న కొనుగోలు బకాయిల కోసం అన్నదాతల ఎదురుచూపులు




- చెల్లింపులు ఆలస్యం.. కెరమెరిలో రైతుల ఆందోళన

**కెరమెరి:** మండలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా జొన్న పంటను విక్రయించిన రైతులకు ఇప్పటికీ కొనుగోలు బకాయిలు చెల్లించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటను కొనుగోలు కేంద్రాలకు అప్పగించి నెలలు గడుస్తున్నా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట సాగు కోసం తీసుకున్న అప్పులు, వాటిపై పెరుగుతున్న వడ్డీలు రైతులను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రానున్న సాగు సీజన్కు అవసరమైన పెట్టుబడులు సమకూర్చుకోవడం కూడా కష్టంగా మారిందని వాపోతున్నారు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం, సంబంధిత అధికారులు చెల్లింపులపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో మండల రైతుల్లో అసంతృప్తి పెరుగుతోంది. కొనుగోలు చేసిన జొన్నకు సంబంధించిన బకాయిలను వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, ఈ విషయంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**





**సిర్పూర్ టీ:** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను 100 శాతం పెంపొందించి పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని సిర్పూర్ -టి మండలం పారిగాం గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలో గల ఇంకుడు గుంత, మూత్రశాలలు, విద్యార్థుల హాజరు సంఖ్య, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలను విద్యార్థుల నమోదు 100 శాతం ఉండేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. 6, 7 తరగతి విద్యార్థులలో గణితం, సైన్స్ సబ్జెక్టులలో గల పట్టణ సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని అంబేద్కర్ నగర్ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. అనంతరం మండలంలోని లోనవెల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరు, రిజిస్టర్లు, ఓ.పి., ల్యాబ్, మందుల నిల్వల గదిని పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది, వైద్యులు విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సహజ సేద్యంతోనే నేలకు రక్షణ

- **సేంద్రియ సాగు వైపు రైతులు అడుగులేయాలి**
- **జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సహజ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని మంగళవారం ఉట్నూర్ రైతు వేదికలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, అధికారులు, రైతులతో కలిసి వర్చువల్గా వీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువుల అధిక వినియోగంతో నేల సారం తగ్గడంతో పాటు వాతావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఆవుపేడ, సేంద్రియ ఎరువుల వినియోగంతో నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని, ప్రకృతి సేద్యం చేపట్టే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. జిల్లాలో వర్షపాతం లోటు ఉన్న నేపథ్యంలో అంతరసేద్యం, మల్చింగ్ వంటి పద్ధతులు పాటించి తేమను సంరక్షించుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పెంపు కోసం ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. డి-పట్టా రైతులకు కూడా మైక్రో ఇరిగేషన్పై భారీ సబ్సిడీ అందిస్తున్నామని, జిల్లాకు మరో 1,350 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు రానున్నాయని చెప్పారు. పట్టా లేని రైతులు కూడా యాప్ ద్వారా ఎరువులు పొందే అవకాశం కల్పించామని, నానో ఎరువుల వినియోగం ప్రయోజనకరమని వివరించారు. జొన్న కొనుగోలు బకాయిలుగా ఉన్న రూ.130 కోట్లను త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ రైతులు సేంద్రియ సాగు వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నీటి సంరక్షణ కోసం ప్రతి ఇంటి, ప్రతి పొలం వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ప్రైవేట్ వ్యాపారులు ప్రచారం చేసే ఆచరణ సాధ్యం కాని విత్తనాలు, ఎరువులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రతి రైతు పొలం గట్లపై మొక్కలు నాటాలని, వ్యవసాయ




అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం మార్గదర్శనం చేయాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించిన వ్యవసాయ అధికారులను, ఆదర్శ రైతులను కలెక్టర్, ఎమ్మెల్యే మెమెంటోలు అందజేసి సన్మానించారు. అనంతరం రైతులకు మొక్కలు పంపిణీ చేసి, రైతు వేదికలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, తహశీల్దార్ రఘునాథ్, ఎంపీడీఓ రైసుద్దీన్, ఏడీఏలు శ్రీధర్, రామ్కిషన్, ప్యాక్స్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ అనిత, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికల తేదీ ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తాం

- **70వ రోజుకు చేరిన కార్మికుల దీక్ష**




**కాగజ్నగర్:** సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కంపెనీ ప్రధాన గేటు ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 70వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం, కార్మిక శాఖతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిర్పూర్ పేపర్ మిల్లు ఎంప్లాయీస్ ప్రొడక్షన్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోలెం వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణలోని ఇతర సంస్థల్లో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తుండగా, సిర్పూర్ పేపర్ మిల్లులో మాత్రం ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం, కార్మిక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. యాజమాన్యం కోర్టును ఆశ్రయించినప్పటికీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడం దురదృష్టకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్మిక శాఖ అధికారులు స్పందించి ఎన్నికల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల తేదీ ప్రకటించే వరకు రిలే నిరాహార దీక్షలను విరమించబోమని, అవసరమైతే 700 రోజులైనా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యాజమాన్యం బెదిరింపులకు కార్మికులు భయపడబోరని అన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలో అల్లం శ్రీనివాస్, గడమల్ల మహేష్ పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు ఠాకూర్ విజయ్ సింగ్, చిట్యాల తిరుపతి, తన్నీరు పోచం, ఏకే సింగ్తో పాటు పలువురు నాయకులు, కార్మికులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

# కెరమెరి ఘాట్లో ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రత్యేక చర్యలు

- **బ్లైండ్ కర్వ వద్ద పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మల తొలగింపు**

**కెరమెరి:** ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ డీఎస్పీ, వాంకిడి సీఐ సూచనలతో కెరమెరి ఘాట్ రోడ్డులోని ప్రమాదకర మలుపుల వద్ద కెరమెరి ఎస్సై శ్రీకాంత్ మంగళవారం ప్రత్యేకంగా పరిశీలన నిర్వహించారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లైండ్ కర్వ్ల వద్ద రహదారి పక్కన అధికంగా పెరిగిన పిచ్చి మొక్కలు, బుషెస్, చెట్ల కొమ్మలు వాహనదారుల దృష్టికి ఆటంకంగా మారుతున్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. ఈ చర్యలతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించే పరిస్థితి ఏర్పడి, రోడ్డు ప్రమాదాలు తగ్గేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కెరమెరి ఘాట్ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, బ్లైండ్ కర్వ్ల వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఘాట్ రోడ్డులో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రత చర్యలు చేపట్టారు.



# ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయండి



**కెరమెరి:** ఆగస్టు 10న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా జాయింట్ కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి పిలుపునిచ్చారు. మండలంలోని మోడీగూరి గిరిజన ఆశ్రమ పాఠశాలలో జైల్ భరో కార్యక్రమ విజయవంతానికి మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం జిల్లాలోని 335 గ్రామాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు, 15 మండల కేంద్రాలు, రెండు మున్సిపల్ కేంద్రాల్లో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ వల్ల గతంలో అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. ఈ చట్టాల కారణంగా పనిగంటలు పెరగడం, కనీస వేతనాలపై ప్రతికూల ప్రభావం పడటం, స్కీం వర్కర్ల శాశ్వతీకరణకు ఆటంకాలు ఏర్పడటం, కార్మికుల సంఘ హక్కులు దెబ్బతినే పరిస్థితి నెలకొంటోందన్నారు. వెంటనే లేబర్ కోడ్స్ను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల డైలీవేజ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా శీత్లా భవాని పండుగ

**బంజారా సాంప్రదాయాల నడుమ ప్రత్యేక పూజలు**



**నేరడిగొండ:** మండలంలోని బోరిగాం, బుగ్గారం గ్రామాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శీత్లా భవాని అమ్మవారి పండుగ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బంజారా సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పండగ వేడుకల్లో భాగంగా మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ బంజారా దుస్తులు ధరించి, ఇళ్లలో సిద్ధం చేసిన నైవేద్యాలను తలపై పళ్లెముల్లో ఎత్తుకుని మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. గ్రామ పొలిమేరలోని శీత్లా భవాని ఆలయం వద్ద వేప కొమ్మల పందిరి కింద అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు, కుంకుమ, పసుపులతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామం సుఖశాంతులతో వర్ధిల్లాలని, పశుసంపద ఆరోగ్యంగా ఉండాలని, అంటువ్యాధులు సోకకుండా అమ్మవారు కాపాడాలని వేడుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించి, గ్రామ ప్రజలందరూ కలిసి ఉత్సాహంగా వనభోజనాలు నిర్వహించారు. బంజారా సాంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని, ఇలాంటి పండుగలు గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్, గ్రామ నాయక్ పవార్ మున్నా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**మొక్కలు నాటిన ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఆదిలాబాద్:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కలు నాటడంతో పర్యావరణానికి కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం రైతు వేదిక ప్రాంగణంలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. వాతావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భావితరాలకు ఉజ్వల భవిష్యత్తు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని, ప్రతి కుటుంబం పచ్చదనం కోసం మొక్కల పెంపకాన్ని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ నందిని, టీఏ మాధురి, ఏపీఓ రజిని, వ్యవసాయ అధికారి అష్రఫ్, ఏఈఓ ఎం.రమేష్, ఏడీఏ శ్రీనివాస్, ఎస్టీఎం సంధ్య, బీసీఎం అరుణ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రామ్గోపాల్ వర్మ, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, బట్టిసావర్గావ్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బట్టిసావర్గావ్ కార్యదర్శి అశోక్, మావల కార్యదర్శి విజయలక్ష్మి , వార్డు సభ్యులు రొడ్డ గంగన్న, అనంతూల లక్ష్మణ్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బురదమయంగా ప్రధాన రహదారి

**ప్రయాణికులకు నరకయాతన**

**ఊసేగాం–హనుమాన్ ఘాట్ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం**



**జైనూర్:** మండలంలోని ఊసేగాం నుంచి హనుమాన్ ఘాట్ వరకు ఉన్న ప్రధాన రహదారి వర్షాల కారణంగా బురదమయంగా మారి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కన మట్టి పేరుకుపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండడంతో రోడ్డు ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు బురదలో ఇరుక్కుపోతుండటంతో పాటు జారి ప్రమాదాలు జరిగే ప్రమాదం నెలకొంది. ఈ మార్గం గుండా ప్రతిరోజూ గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు రాకపోకలు సాగిస్తుండగా, దయనీయంగా మారిన రహదారి కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల రహదారి అంచులు దెబ్బతినడంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర సమయాల్లో కూడా ఈ మార్గంలో ప్రయాణించడం కష్టంగా మారిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఊసేగాం–హనుమాన్ ఘాట్ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించి, నిల్వ నీరు వెళ్లేలా చర్యలు చేపట్టడంతో పాటు రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

చురకలు



## పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

### జైనూర్ నూతన అధ్యక్షుడిని సన్మానించిన డీసీసీ అధ్యక్షురాలు



**జైనూర్:** మండల స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన షేక్ రషీద్ను మంగళవారం శాలువతో ఘనంగా సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో షేక్ రషీద్ మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ ఆదేశాలను అమలు చేస్తూ రాబోయే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో చురుకుగా పనిచేయాలని తెలిపారు. అలాగే జైనూర్ మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా షేక్ రషీద్ మాట్లాడుతూ తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జైనూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీసీసీ ఉపాధ్యక్షుడు తారీఖ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్, జైనూర్ మండల నాయకులు జమీల్, సుదర్శన్, ఈసా తదితరులు పాల్గొన్నారు.

## నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

### డీపీఓ వెంకటేశ్వరరావు



**తాండూర్:** నీటి వనరుల పరిరక్షణతో పాటు సాగునీటి భద్రతకు రైతులు, ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలని డీపీఓ వెంకటేశ్వరరావు అన్నారు. తాండూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జలసిరి పథకంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈజీఎస్ ఏపీఓ ఇన్చార్జి సత్యనారాయణ అధికారులు, సర్పంచ్లకు పథకం వివరాలను వివరించారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు వంద శాతం సబ్సిడీతో చెక్ డ్యామ్లు, ఇంకుడు గుంతలు, భూగర్భ జలాల రీచార్జ్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. నీటి వనరుల పరిరక్షణ, భవిష్యత్ సాగునీటి అవసరాల కోసం రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో అధికారులు, సర్పంచ్లు రైతులకు అవగాహన కల్పించి పథకం అమలుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అంజయ్య, డీఎల్పీఓ సతీష్ కుమార్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు, అటవీ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ, ఈజీఎస్, ఐసీడీఎస్ సిబ్బంది, తాండూర్ పీహెచ్సీ వైద్యులు, పశు వైద్యులు, పీఆర్ఏఈ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు అభివృద్ధే ప్రధాన లక్ష్యం

### మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్



**సత్తుపల్లి:** కల్లూరు పట్టణ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారంతో కల్లూరు మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో రూ.43 లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, వార్డు కౌన్సిలర్ యాస నాగమణి శ్రీకాంత్తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణంశెట్టి లక్ష్మీ కొండలు, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు ధరావత్ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ, రోడ్డు సౌకర్యం కల్పించాలి

- పి డీ ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి

**ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తక్షణమే ప్రహరీ గోడ నిర్మించాలని మరియు కళాశాలకు బి.టి. రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఆసిఫాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ హరిత కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి మాట్లాడుతూ 1992వ సంవత్సరంలో అప్పటి జిల్లా అధికారులు, మండల తహసీల్దార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం దాదాపు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. అయితే భవన నిర్మాణం చేసే సమయానికి చుట్టుపక్కల ఆక్రమణల వల్ల కేవలం రెండున్నర ఎకరాల స్థలం మాత్రమే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని మరికొందరు గుడులు, హాళ్ల పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాము గుళ్లకు, దేవుళ్లకు వ్యతిరేకం కాదని, ఒకవేళ అది గుడి స్థలమే అయితే ఆధారాలతో నిరూపించుకోవాలే తప్ప కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు సృష్టించవద్దని స్పష్టం చేశారు. కళాశాల భూమిని కేవలం విద్యార్థుల ఆట స్థలం మరియు నూతన భవనాల నిర్మాణం కోసమే వినియోగించాలని కోరారు. అలాగే కళాశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో విద్యార్థులు బురదలోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, ఈ సమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు బి.టి. రోడ్డు సౌకర్యం కల్పించాలని, లేని పక్షంలో విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యూ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సమీర్, మండల కార్యదర్శి జగజంపుల తరుణ్, మండల నాయకులు శివ శంకర్, కళాశాల కమిటీ కన్వీనర్ సాయి చరణ్, కో-కన్వీనర్లు టీ. రవి, సమీర్, నిరోష, సభ్యులు లావణ్య, ముస్కన్, వైష్ణవి, సౌమ్య, హారిక, రాను తదితరులు పాల్గొన్నారు.



# ఓవర్లోడ్ లారీల రాజ్యం..

- కోసిని గ్రామంలో ప్రజల ప్రాణాలు గాల్లో
- విద్యుత్ వైర్లకు ముప్పు.. చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

**కాగజ్నగర్:** కాగజ్నగర్ మండలంలోని కోసిని గ్రామ రహదారులపై పరిమితికి మించి బొంగులు లోడ్ చేసిన లారీలు యథేచ్ఛగా వెళ్తుండడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవర్లోడ్తో వెళ్తున్న లారీలు గ్రామంలోని విద్యుత్ వైర్లను తరచూ తాకుతూ ప్రమాదకర పరిస్థితులకు కారణమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గ్రామంలో విద్యుత్ వైర్లకు తరచూ నష్టం వాటిల్లడంతో రోజుకు పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని తెలిపారు. దీంతో విద్యార్థులు, రైతులు, వృద్ధులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడితే భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లారీలకు విద్యుత్ షాక్ తగిలి అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం కూడా ఉందన్నారు. అధిక బరువుతో వెళ్తున్న లారీల కారణంగా గ్రామ రహదారులు వేగంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధిక లోడ్తో వెళ్తున్న ఓ బొంగుల లారీని మంగళవారం గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. అనంతరం సంబంధిత అధికారుల తక్షణ జోక్యాన్ని కోరుతూ తమ డిమాండ్లను వెల్లడించారు. ఓవర్లోడ్ లారీల రాకపోకలను వెంటనే నిలిపివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న లారీ యజమానులు, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.




# గిరిజనుల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదు

- పోడు రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్నగర్:** గిరిజనుల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించేది లేదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ హెచ్చరించారు. పెంచికలపేట మండలంలోని పోతేపల్లి గ్రామ శివారులో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన రైతులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న ఆయన మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అటవీ, రెవెన్యూ అధికారులతో ఆయన ప్రత్యక్షంగా చర్చించారు. తరతరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న గిరిజనుల హక్కులను గౌరవించాలని, వారి జీవనాధారమైన భూముల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతులను బెదిరించడం, సాగుకు ఆటంకం కలిగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గిరిజనుల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, గిరిజనుల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఏ స్థాయిలోనైనా పోరాటం చేస్తామని, పోడు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ఎమ్మెల్సీ జోక్యంతో అధికారులు సానుకూలంగా స్పందించి గిరిజన రైతులు తమ పోడు భూముల్లో వ్యవసాయం కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను స్వయంగా పరిశీలించి పరిష్కార మార్గం చూపిన ఎమ్మెల్సీ దండే విఠల్కు గిరిజన రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ చొరవతో ఇద్దరు చిన్నారులకు కొత్త భవిష్యత్

- బడి బయట పిల్లలు లేకుండా చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్: జిల్లాలో ఒక్క చిన్నారి కూడా బడిబయట ఉండకుండా ప్రతి బాలబాలికకు విద్య అందేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టంగా చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండల పర్యటన సందర్భంగా బడిబయట ఉన్న ఇద్దరు చిన్నారులను గుర్తించిన కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించడంతో వారికి కొత్త భవిష్యత్తు బాటలు పడ్డాయి. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని సాయినగర్లో నివసిస్తున్న కమరే మల్లేష్ పవార్ కుటుంబానికి చెందిన నలుగురు పిల్లల్లో ఇద్దరు మాత్రమే పాఠశాలకు వెళ్తుండగా, మరో ఇద్దరు చిన్నారులు తండ్రితో కలిసి వృత్తి పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు కలెక్టర్ గుర్తించారు. వెంటనే జిల్లా సంక్షేమ అధికారి మిల్కాకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ అధికారులు కుటుంబాన్ని కలిసి తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యతను వివరించారు. అనంతరం చిన్నారి సునీతను ఇంద్రవెల్లి జెడ్పీహెచ్ఎస్లో 6వ తరగతిలో, సునీల్ను ఎంపీపీఎస్ ఇంద్రవెల్లిలో 5వ తరగతిలో చేర్పించి విద్యాభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒక్క బాల కార్మికుడు, ఒక్క బడిబయట పిల్లవాడు కూడా ఉండకూడదనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ప్రతి చిన్నారికి విద్య హక్కు అని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అలాగే ఎక్కడైనా బడిబయట పిల్లలు, బాల కార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్లైన్ 1098కు సమాచారం అందించి వారి విద్యాభ్యాసానికి, బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.



# చిన్నారి కిడ్నాప్ ఘటనపై తలమడుగు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

**ఆదిలాబాద్:**

తల్లిదండ్రులకు తెలియకుండా చిన్నారిని రుయ్యాడి నుంచి ఆదిలాబాద్కు తీసుకువచ్చి బస్టాండ్లో ఇతరులకు అప్పగించిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు తలమడుగు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారి ఆత్రం గంగామణి ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని అన్నారు. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన నిందితురాలు నైతం నాగుబాయి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆత్రం గంగామణిని ఆమె కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆదిలాబాద్ పట్టణానికి తీసుకువచ్చింది. బస్టాండ్ వద్ద ఇతరులకు అప్పగించింది. చిన్నారి కోసం గాలించిన ఆమె తల్లి ఆత్రం కప్లి బాయి తలమడుగు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితురాలిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్సై డి.రాధిక, రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు, తనిఖీలను ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిందితురాలు సంచరించిన ఆదిలాబాద్ బస్టాండ్, తాంసి బస్టాండ్ ఏరియాలలో సీసీ కెమెరాలను పరిశీలించగా, మహిళ చిన్నారితో కలిసి సంచరించినట్లు గుర్తించారు. చిన్నారి ఆత్రం గంగామణి వయస్సు నాలుగు సంవత్సరాలు ఉంటుందని, తనకు కోలాం భాష, కొద్దిగా తెలుగు వస్తాయని తెలిపారు. చిన్నారి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించాల్సిన అధికారుల ఫోన్ నంబర్లు తలమడుగు ఎస్సై 8712659928, ఆదిలాబాద్ రూరల్ సీఐ 8712659915, ఆదిలాబాద్ డీఎస్పీ 8712659914, బాలికను గుర్తించిన వెంటనే తల్లిదండ్రులకు, దగ్గరలో ఉన్న పోలీసులకు, డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ఆదిలాబాద్ డీఎస్పీ సూచించారు.





# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- పారదర్శకంగా మ్యాపింగ్, రికార్డుల సవరణ
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



తాండూర్: భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియతో భూ సమస్యల పరిష్కారం సులభతరం కావడంతో పాటు భవిష్యత్తులో భూమి వివాదాలకు చెక్ పడుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం తాండూర్ మండలం ద్వారకాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన రీ సర్వే కార్యక్రమాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహశీల్దార్ జ్యోత్స్న, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాస్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు, ఇతర ఆధారాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి భూమికి హద్దులు నిర్ధారించి స్పష్టమైన మ్యాపింగ్ రూపొందించడం ద్వారా ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములపై స్పష్టత వస్తుందన్నారు. పట్టా ఉండి మోకాలో నమోదు కాని భూములు, మోకాలో ఉండి పట్టా లేని భూముల అంశాలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీ సర్వే అనంతరం అసలైన అర్హుల పేర్లతో భూ రికార్డులు నమోదు చేయడంతో పాటు పకడ్బందీ నక్షాలు రూపొందిస్తామని తెలిపారు. గ్రామంలో దాదాపు 90 శాతం భూముల సమస్యలకు ఇప్పటికే పరిష్కారం లభించిందని, మిగిలిన వివాదాస్పద భూములు కోర్టు తీర్పు అనంతరం పరిష్కారమవుతాయని వివరించారు. భవిష్యత్తులో జరిగే భూ లావాదేవీలకు అనుగుణంగా మ్యాపులను ఎప్పటికప్పుడు నవీకరిస్తామని తెలిపారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలోని కొత్తపల్లి రైతు వేదికలో నిర్వహించిన రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులతో కలిసి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు ప్రభుత్వ సూచనల మేరకు పంటల సాగు చేపట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై పశువులను వదిలితే కఠిన చర్యలు

డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి



ఆదిలాబాద్: పశువులను రోడ్లపై వదిలితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఆదిలాబాద్ పట్టణంలో పోలీసు, మున్సిపల్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో రోడ్లపై పశువులను వదిలే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తున్న 22 పశువులను గుర్తించి మంగళవారం ఇచ్చోడ గోశాలకు తరలించారు. నిబంధనలు ఉల్లంఘించిన కైలాష్, అహ్మద్ ఖాన్, సాజిత్ ఖాన్ తో పాటు మరికొందరి యజమానులపై వన్టౌన్ లో కేసులు నమోదు చేశారు. గోశాలలో పశువులు ఉన్నన్ని రోజులకు సంబంధించిన నిర్వహణ రుసుమును యజమానులే చెల్లించాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ దృష్ట్యా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్టౌన్ సీఐ బి.సునీల్ కుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ వంద శాతం పూర్తి చేయాలి





కెరమెరి: ఓటరు జాబితా సవరణ వంద శాతం పూర్తి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం కెరమెరి మండలం ఝరి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, బూత్ స్థాయి అధికారులతో మాట్లాడిన ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, పార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్, ఇందిరా ఫెలోషిప్ జిల్లా కోఆర్డినేటర్ కొవ ఇందిర, యూత్ కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు కమల్నాథ్ రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎలగల సాయి కుమార్, మొహమ్మద్, అయూబ్ ఖాన్, గిడ్డప్ప, పెందోర్ బిల్లు, బీఎల్ఏ కోవ బదిరావు, బీఎల్వోలు మీరాబాయి, సావిత్రిబాయి, పద్మక్క తదితరులు పాల్గొన్నారు.

# భూ తగాదా కేసులో ఇద్దరి రిమాండ్



తాండూర్: భూ తగాదా కేసులో ఇద్దరిని రిమాండ్ కు తరలించడం జరిగిందని తాండూర్ ఎస్సై ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 12 న బోయపల్లి గ్రామ శివారులో జరిగిన భూ తగాదా విషయంలో బోయపల్లి గ్రామానికి చెందిన మాసాడి భాస్కర్ అనే వ్యక్తి పై దాడి జరిగింది. అదేరోజు భాస్కర్ సోదరులు పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటన స్థలానికి వెళ్లడంతో పాటు ఈ ఘటనలో గాయపడిన భాస్కర్ ద్వారా సమాచారం తెలుసుకొని విచారించడం జరిగింది. భాస్కర్ పై దాడి చేసిన పూసాల ప్రశాంత్, సిద్ధం శివ గణేష్లను అరెస్టు చేశాం. నిందితులను బెల్లంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి నిందితులకు 14 రోజుల రిమాండ్ తో పాటు ఆసిఫాబాద్ జైలుకు పంపించడం జరిగిందని వివరించారు.

# ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



సత్తుపల్లి: ఆగస్టు 23, 24 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్న ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా 17వ మహాసభలను జయప్రదం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే, మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో మంగళవారం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక కోడ్కు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని పేర్కొన్నారు. మహాసభల ఆహ్వాన సంఘం కార్యదర్శులు దండు ఆదినారాయణ, నిమ్మటూరు రామకృష్ణ మాట్లాడుతూ ఏఐటీయూసీ ఏర్పడిన తర్వాత తొలిసారిగా సత్తుపల్లిలో జిల్లా మహాసభలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణను రూపొందించి కార్మిక వర్గ పరిరక్షణ కోసం ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి, పరిసర ప్రాంతాల ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహాసభల చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఆహ్వాన సంఘం కోశాధికారి తడికమళ్ల యోబు, గాదె చెన్నకేశవరావు, బీసీ సంఘం అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు చల్లగా నరసింహారావు, బీసీసీబీ డైరెక్టర్ చల్లగల్ల కృష్ణయ్య రాము తదితరులు పాల్గొన్నారు.

# నేరడిగొండ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లింగంపల్లి సురేష్



నేరడిగొండ: జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యుల నియామకాలను చేపట్టినట్లు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ పరమేశ్వర్ కోలేట్కర్ తెలిపారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు నేరడిగొండ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా యువ నాయకుడు లింగంపల్లి సురేష్ను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లింగంపల్లి సురేష్ మాట్లాడుతూ తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ చేస్తూ గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

# సమాజ సేవకు అంతర్జాతీయ గౌరవం

- కేశెట్టి సంతోష్ కుమార్కు హానరరీ డాక్టరేట్ ప్రతిపాదన



తాండూర్: సమాజ సేవను జీవిత ధ్యేయంగా ఎంచుకుని మూడు దశాబ్దాలుగా ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న తాండూర్ మండల కేంద్రానికి చెందిన కేశెట్టి సంతోష్ కుమార్ (అభినవ)కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. అభినవ కల్చరల్ సోషల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా సేవలందిస్తున్న కేశెట్టి సంతోష్ కుమార్కు అమెరికాకు చెందిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ (యూఏఐ) ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్స్ సంస్థ "డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ హానరరీ గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేయాలని ప్రతిపాదించింది. ఈనెల 17న యూనివర్సిటీ తరఫున అవార్డు ప్రదాన ప్రతిపాదనను అధికారిక నామినేషన్ సభ్యురాలు డాక్టర్ అభినయ వాసవి ద్వారా పంపించారు. యూనివర్సిటీ ప్రతిపాదన ప్రకారం ఆగస్టు 29న పుదుచ్చేరిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవం జరగనుంది. కేశెట్టి సంతోష్ కుమార్ గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ గౌరవానికి ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ పేర్కొంది. రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయ కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, యువతలో సేవా స్ఫూర్తి పెంపొందించడం, సామాజిక చైతన్య కార్యక్రమాలు, మానవతా సేవల్లో ఆయన చేసిన కృషిని గుర్తించినట్లు తెలిపింది. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అభిమానులు కేశెట్టి సంతోష్ కుమార్కు అభినందనలు తెలిపారు. ఈ గౌరవం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

# రిమ్స్లో రోగులను పరామర్శించిన సాజిద్ ఖాన్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న



రోగులను డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పలు వార్డుల్లోని బాత్రూమ్లు దెబ్బతినడంతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు సక్రమంగా పనిచేయక రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్కు విజ్ఞప్తి చేశారు.

## అర్హులందరూ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

జైనూర్: ఎస్ఐఆర్ సర్వేలో అర్హులందరూ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని జైనూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ అబ్బు అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు ప్రజలకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు సక్రమంగా అందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన వారు సర్వేలో తప్పనిసరిగా పాల్గొని సరైన వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరాలంటే ప్రజలు అధికారులకు సహకరించి అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు.



# రేవంతన్న మాట తప్పని నేత

- ఎయిర్పోర్టు నిధుల విడుదలపై సీఎంకు ఆడే గజేందర్ కృతజ్ఞతలు



నేరడిగొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకుడని, ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి ఎయిర్పోర్టు నిధుల విడుదలే నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. ఆదిలాబాద్ ఎయిర్పోర్టు భూసేకరణ, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.2,278.14 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడంపై పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి "ఆదిలాబాద్ను దత్తత తీసుకుంటా" అని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. గత పాలకులు ఆదిలాబాద్ అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. డిసెంబర్ 31 నాటికి భూసేకరణ, విద్యుత్ లైన్ల బదిలీ వంటి మౌలిక పనులు పూర్తి చేసి, 2028 జూన్ నాటికి విమానాల రాకపోకలు ప్రారంభించేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆదిలాబాద్ను విమానయాన పటంలో చేర్చేందుకు భారీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఈ ప్రక్రియలో సహకరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్అండ్బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావులకు బోథ్ నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చరకలు







# నిబంధనలకు పాతర?

**వసతి గృహాల టెండర్లలో అక్రమాల ఆరోపణలు ■ సీల్డ్ టెండర్లకు బదులు ఓపెన్ టెండర్లు!**

**బ్లాక్‌లిస్ట్ కాంట్రాక్టర్లకూ అవకాశం కల్పించారనే విమర్శలు ■ ప్రభుత్వ నిధుల దుర్వినియోగమంటూ కాంట్రాక్టర్ల ఆవేదన**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని గురుకుల, జ్యోతిబా పూలే, ఆదర్శ పాఠశాలల వసతి గృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, గ్యాస్ తదితర సరఫరాల కోసం నిర్వహించిన టెండర్ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. నిబంధనల ప్రకారం సీల్డ్ టెండర్లు నిర్వహించాల్సి ఉండగా, ఓపెన్ టెండర్లు స్వీకరించారని, బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్లకు కూడా అవకాశం కల్పించారని టెండర్లలో పాల్గొన్న పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని ఐదు జ్యోతిబా పూలే పాఠశాలలు, కళాశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు, నాలుగు మైనారిటీ గురుకులాలు, రెండు ఆదర్శ పాఠశాలలకు సంబంధించి టెండర్లు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఒకే కాంట్రాక్టర్‌కు దాదాపు 15 విద్యాసంస్థల సరఫరా బాధ్యతలు దక్కేలా కొందరు అధికారులు సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు సరఫరా చేయడానికి ముందుకొచ్చిన అర్హులైన కాంట్రాక్టర్లను పక్కనపెట్టి, ఎక్కువ ధర కోట్ చేసిన వారికి టెండర్లు కట్టబెట్టడం వల్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని, ఇటీవల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కూడా ఫిర్యాదు సమర్పించినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. గురుకుల టెండర్లలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసంఘాలు, బాధిత కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

–ఆసిఫాబాద్




## ఉపాధి కల్పన పథకంలో అవకతవకలపై విచారణ జరపాలి



**సత్తుపల్లి:** ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం అమలులో చోటుచేసుకుంటున్నట్లు అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, అర్హులైన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోతు విజయ్ అన్నారు. సోమవారం బీజేపీ నాయకులతో కలిసి ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలోని సంబంధిత బ్యాంక్ల ప్రాంతీయ మేనేజర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని కొందరు ఆర్థికంగా బలమైన వ్యక్తులు, రాజకీయ పలుకుబడి కలిగిన వారు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన వారు కూడా ఈ పథకం కింద రుణాలు పొందుతూ, సబ్సిడీ కోసం పేరుకే పరిశ్రమలు, సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. రుణాల మంజూరులో మధ్యవర్తులు, ప్రభావశీలులు, కొందరు అధికారుల ప్రమేయం ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని, క్షేత్రస్థాయిలో సరైన పరిశీలన లేకుండానే రుణాలు మంజూరు చేస్తున్నారనే సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పథకం కింద మంజూరైన అన్ని రుణాలపై సమగ్ర విచారణ చేపట్టి, యూనిట్లు నిజంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారా, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. తప్పుడు పత్రాలతో, అక్రమ మార్గాల్లో సబ్సిడీలు పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అర్హులైన నిరుద్యోగ యువతకు పారదర్శకంగా రుణాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. మధ్యవర్తుల జోక్యాన్ని పూర్తిగా అరికట్టి, ప్రజా ధనం నిజమైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, ప్రధాన కార్యదర్శి మంద శివ, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, డాక్టర్ పెద్దిరాజు, వీరబాబు, కార్తీక్ యాదవ్, అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బోడ మహేందర్ కుటుంబానికి న్యాయం చేయాలి

**ములుగు:** బోడ మహేందర్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా మాల మహానాడు ప్రతినిధులు ములుగు అదనపు కలెక్టర్ మహేందర్జీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బోడ మహేందర్ ఆత్మహత్యకు గల కారణాలపై నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అదనపు కలెక్టర్ సంబంధిత అంశాన్ని పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ



ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాల మహానాడు నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో లబ్ధి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల:** ప్రస్తుత ఎల్నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, రానున్న మూడు నెలల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. నీటి లభ్యత తగ్గే అవకాశమున్నందున వరి సాగులో నష్టాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్పామ్ వంటి తక్కువ నీటి అవసరమున్న పంటల సాగుపై దృష్టి సారించాలని



అన్నారు. రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటల సాగుపై రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం భీమారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మోడల్ ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి పాల్గొన్నారు. అలాగే మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిశీలన పురోగతిని సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బీఎల్ఏల ద్వారా మిగిలిన ఫారాలను సేకరించి బూత్ స్థాయి అధికారులకు అందించాలని సూచించారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చట్టం ఉంది.. బోర్డులు ఏవి?

## ప్రభుత్వ కార్యాలయాల్లో గాలికి వదిలేసిన 'ఆర్టీఐ'



**నేరడిగొండ:** నిబంధనలు ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రతీకగా నిలిచిన సమా చార హక్కు చట్టం (ఆర్టీఐ)అమలు క్షేత్రస్థాయిలో నీరుగారి పోతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఆర్టీఐ బోర్డులు చాలాచోట్ల కనిపించడమే లేదు. దీంతో సామాన్యులకు ఏ సమాచారం ఎవరిని అడ గాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చట్టం తెచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, అధికారుల నిర్లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో దీని అమలు నామమాత్రంగా మారింది.

### కనిపించని బోర్డులు.. కొరవడిన పారదర్శకత

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ ఆర్టీఐ చట్టం కింద ఆ శాఖకు సంబంధించిన అప్పీలేట్ అథారిటీ, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐఓ) పేర్లు, ఫోన్ నెంబర్లు, హోదాలతో కూడిన బోర్డులను విధిగా ప్రదర్శించాలి. కానీ తహశీల్దార్ కార్యాలయాల నుంచి మొదలుకొని మున్సిపల్ ఆఫీసులు, పంచాయతీ రాజ్, విద్యా, వైద్య శాఖల వరకు చాలా చోట్ల ఈ నిబంధనను పూర్తిగా గాలికి వదిలేశారు. కొన్నిచోట్ల పాత బోర్డులు ఉన్నా, వాటిపై ఉన్న అధికారులు బదిలీ కావడంతో కొత్త పేర్లు అప్డేట్ చేయడం లేదు. మరికొన్ని కార్యాలయాల్లో అసలు బోర్డుల జాడే లేకపోవడం గమనార్హం.

### ఎవరిని అడగాలి సమాచారం?

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సామాన్యులకు సమాచార అధికారి ఎవరో తెలియక అవస్థలు పడుతున్నారు. బోర్డులు లేకపోవడంతో ఎవరికి దరఖాస్తు చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఇది పరోక్షంగా అధికారుల బాధ్యతారహిత్యానికి దారితీస్తోంది.

### చట్టం ఉల్లంఘనే..

ఆర్టీఐ చట్టం సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు తమ వివరాలను స్వచ్ఛందంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కానీ బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలను ప్రశ్నించకుండా ఉండేందుకే ఉద్దేశపూర్వకంగానే ఈ బోర్డులను ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు వస్తే సమాచారం ఇవ్వాల్సి వస్తుందనే భయంతో కొందరు అధికారులు ఈ నిబంధనను అమలు చేయడం లేదని పౌర హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి.

### తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసముంది..

జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు స్పందించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డుల ఏర్పాటును పరిశీలించాలి. నిబంధనలను విస్మరించి బోర్డులు ఏర్పాటు చేయని అధికారులపై ఆర్టీఐ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. కేవలం భౌతిక బోర్డులే కాకుండా, ప్రతి శాఖ అధికారిక వెబ్సైట్లోనూ పీఐఓ వివరాలు స్పష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ప్రజాస్వామ్యంలో పౌరుడికి ఉన్న అత్యంత బలమైన ఆయుధం సమాచార హక్కు చట్టం. దీనిని అమలు చేయాల్సిన అధికారులే చట్టానికి తూట్లు పొడుస్తుంటే, పారదర్శకత ఎలా సాధ్యమనే ప్రశ్న పౌర సమాజం నుంచి గట్టిగా వినిపిస్తోంది. కాలయాపన చేయకుండా యంత్రాంగం ఇప్పటికైనా మేల్కొంటుందో లేదో వేచి చూడాలి.



# ఎమ్మార్పీ చెరిపి ఆహార పదార్థాల విక్రయం?

- జైనూర్లో వినియోగదారుల ఆందోళన..
- తనిఖీలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి

**జైనూర్:** మండలంలోని కొన్ని కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపార కేంద్రాల్లో ప్యాకెట్ ఆహార పదార్థాలపై ముద్రించిన ఎమ్మార్పీను మార్కర్ పెన్తో చెరిపి కనిపించకుండా చేసి విక్రయిస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీంతో ఉత్పత్తి అసలు ధర ఎంత అనే విషయం వినియోగదారులకు తెలియక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎమ్మార్పీ కనిపించకుండా చేయడంతో అధిక ధరలకు వస్తువులను విక్రయించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ప్యాకెట్ ఆహార ఉత్పత్తులపై తయారీదారు ముద్రించిన ఎమ్మార్పీ, తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్ వంటి వివరాలు స్పష్టంగా కనిపించేలా ఉండాలని కోరుతున్నారు. ఎమ్మార్పీను మార్కర్ పెన్తో చెరిపివేయడం ద్వారా కనిపించకుండా చేయడం వినియోగదారుల హక్కులకు విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్యాకెట్ ఆహార పదార్థాలను కొనుగోలు చేసే ముందు ఎమ్మార్పీ, తయారీ తేదీ, గడువు తేదీ వంటి వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని, అనుమానాస్పదంగా అనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని పలువురు సూచిస్తున్నారు.




# సింగరేణి పెన్షన్‌దారులకు ప్రమాద బీమా కల్పించాలి

## యూనియన్ బ్యాంక్ ఎదుట నల్లబ్యాడ్జీలతో ధర్నా

**తాండూర్:** సింగరేణి విశ్రాంత కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు రూ.30 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తాండూర్లోని యూనియన్ బ్యాంక్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ నిశంత్కు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందినా, యూనియన్ బ్యాంకులో ఖాతాలు కలిగిన 70 సంవత్సరాల లోపు కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు ఒప్పందం ప్రకారం రూ.30లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, యూనియన్ బ్యాంక్ మధ్య 2024 ఫిబ్రవరి 26న కుదిరిన ఒప్పందం ప్రకారం బీమా సౌకర్యాలు అమలు కావాల్సి ఉన్నప్పటికీ, గత రెండేళ్లుగా బ్యాంకు [illegible]




ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున [illegible] సీ. రాయలింగు, ఎడ్ల గొంతయ్య, మాదారం, తాండూర్, [illegible]



# రక్తదానం ప్రాణదానంతో సమానం

## సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

**సత్తుపల్లి:** రక్తదానం ప్రాణదానంతో సమానం అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో కమల్ మిత్ర ఫార్మసీ, కమల్ మిత్ర మోటార్స్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం సత్తుపల్లి పట్టణం మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ముత్తూట్ ఎమ్ క్రెడ్ గోల్డ్ లోన్ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాఖ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన ఆర్థిక సేవలు అందించాలని సూచించారు. స్థానిక వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఆర్థిక సంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు, బ్యాంక్ప్రతినిధులు, రక్తదాతలు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలో సమస్యలపై చర్చ

## 102 అంబులెన్స్ సేవలు కల్పించాలని గ్రామస్తుల డిమాండ్



**జైనూర్:** మండలంలోని జంగం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఉపాధిహామీ పనులు, పెన్షన్లు, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సరఫరా, సంక్షేమ పథకాల అమలు, గృహ నిర్మాణాలు, గ్రామంలోని మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇస్తూ, గ్రామ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతిఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు పేర్కొన్నారు. గ్రామ సభలో జంగం గ్రామానికి అత్యవసర వైద్య సేవలైన 102 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణీలు, వృద్ధులు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులను సమయానికి ఆస్పత్రికి తరలించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. వెంటనే జంగం గ్రామానికి 102 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యులు రవీందర్, లక్ష్మణ్, కీర్తన్, నాసోరు, అంబిబాయి, లక్ష్మి తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



**జైనూర్:** పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని గ్రామ సర్పంచ్ పెందూర్ అనసూయ అర్జున్ అన్నారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పరిశుభ్రతను అలవాటు చేసుకుని తమ పాఠశాలను అందంగా, పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఉప సర్పంచ్ మాట్లాడుతూ పరిశుభ్రమైన పాఠశాలలతో విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సయ్యద్ మహెబూబ్, [illegible]

# టీమిండియాలో కొత్త ముఖం



- 33ఏండ్ల సారాంశ్ జైన్ ఎవరూ?
- శ్రీలంకతో జరగబోయే టెస్టు సిరీస్‌కు సెలక్టర్ల నుంచి పిలుపు
- దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో గుర్తింపు
- వాషింగ్టన్ సుందర్ గాయపడటంతో దక్కిన అరుదైన అవకాశం
- తుది జట్టులో చోటు కోసం మానవ్ సుతార్‌తో తీవ్ర పోటీ

**న్యూఢిల్లీ, జూలై 29:** భారత క్రికెట్‌లో పట్టుదల, నిరంతర శ్రమకు ఫలితం ఎప్పటికైనా దక్కుతుందని మరోసారి రుజువైంది. దాదాపు దశాబ్ద కాలంగా దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా గుర్తింపునకు నోచుకోని మధ్యప్రదేశ్ ఆల్ రౌండర్ సారాంశ్ జైన్, ఎట్టకేలకు 33 ఏళ్ల వయసులో తొలిసారి భారత టెస్టు జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఆగస్టులో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సెలక్టర్లు అతనికి చోటు కల్పించారు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేసే సారాంశ్, టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను తన ఆరాధ్యుడిగా భావిస్తాడు.

### ఎవరీ సారాంశ్ జైన్?

మధ్యప్రదేశ్‌కు చెందిన సారాంశ్ జైన్ తండ్రి సుబోధ్ జైన్ కూడా మాజీ ఫస్ట్-క్లాస్ క్రికెటర్. తండ్రి స్ఫూర్తితో క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సారాంశ్, 2014లోనే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. అయితే, సుదీర్ఘకాలం పాటు జట్టులో స్థానం కోసం పోరాడాల్సి వచ్చింది. 2022 వరకు కేవలం 8 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన అతను, ఆ ఏడాది మధ్యప్రదేశ్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించి వెలుగులోకి వచ్చాడు. నాకౌట్ దశలో 13 వికెట్లు పడగొట్టడమే కాకుండా, ఒక అర్ధ సెంచరీతో జట్టు విజయంలో తన వంతు సహకారం అందించాడు. ఇక గతేడాది రంజీ సీజన్ అయితే అతని కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలిచింది. బ్యాటింగ్‌లో 57.55 సగటుతో 518 పరుగులు, బౌలింగ్‌లో 20.43 సగటుతో 30 వికెట్లు తీసి ఆల్ రౌండర్‌గా అద్భుత ప్రదర్శన కనబరిచాడు. దీనికి ముందు జరిగిన దులీప్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ తరఫున కేవలం రెండు మ్యాచ్‌లలో 16 వికెట్లు, రెండు అర్ధ సెంచరీలు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది సిరీస్" అవార్డును గెలుచుకున్నాడు. సారాంశ్ గత నెలలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు నెట్ బౌలర్‌గా కూడా సేవలందించాడు.

### సెలక్షన్‌కు కారణం ఇదే

రెగ్యులర్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయంతో తొలి టెస్టుకు దూరం కావడంతో సెలక్టర్లు ప్రత్యామ్నాయం కోసం అన్వేషించారు. శ్రీలంక జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటంతో, ఒక ఆఫ్ స్పిన్నర్ అవసరాన్ని గుర్తించారు. అదే సమయంలో సారాంశ్ జైన్ ఇటీవలే ఇండియా-ఏ జట్టుతో కలిసి శ్రీలంకలో పర్యటించాడు. అక్కడ తొలి మ్యాచ్‌లో సాధారణంగా రాణించినా, రెండో మ్యాచ్‌లో అజేయంగా 70 పరుగులు చేసి, 6 వికెట్లు పడగొట్టి తన ఎంపికకు మార్గం సుగమం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని బలంగా ఆకర్షించి, జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

### అరంగేట్రం చేసే అవకాశాలు

శ్రీలంక పిచ్‌లపై ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని భారత జట్టు యాజమాన్యం భావిస్తోంది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ తుది జట్టులో ఉండటం దాదాపు ఖాయం. మూడో స్పిన్నర్ స్థానం కోసం సారాంశ్ జైన్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ఘనిస్థాన్‌పై అరంగేట్రంలోనే 7 వికెట్లు తీసి సుతార్ ఆకట్టుకున్నాడు. అయితే, జట్టులో ఇప్పటికే జడేజా రూపంలో ఒక లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఉన్నందున, మరొకరిని ఆడించేందుకు యాజమాన్యం మొగ్గు చూపకపోవచ్చు. శ్రీలంక బ్యాటింగ్ లైనప్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటం సారాంశ్ కు కలిసొచ్చే అంశం. ఒకవేళ అతను తుది జట్టులో చోటు దక్కించుకుంటే, 1998లో రాబిన్ సింగ్ తర్వాత 33 ఏళ్ల వయసు దాటాక టెస్టు అరంగేట్రం చేసిన మరో భారత క్రికెటర్‌గా అరుదైన ఘనత సాధిస్తాడు.

# ఫ్రాన్స్ ఫుట్‌బాల్‌కు కొత్త కోచ్

## వరల్డ్‌కప్ విజేతకు బాధ్యతలు!



ఫుట్‌బాల్ దిగ్గజం జినెదినె జిదానే ఫ్రాన్స్ కోచ్‌గా నియమితులయ్యాడు. వరల్డ్‌కప్ విజేత, మాజీ కెప్టెన్ అయిన జిదానె జాతీయ జట్టుకు కోచ్ అవుతారని ఏళ్లుగా ప్రచారంలో ఉన్న వార్తలను నిజం చేస్తూ ఆయన త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు. తమదేశ వెటరన్ ఆటగాడికి కోచింగ్ పదవి కట్టబెట్టిన విషయాన్ని మంగళవారం ఫ్రెంచ్ ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించింది. ఫిఫా వరల్డ్‌కప్‌లో ఫ్రాన్స్ సెమీస్‌లోనే వెనుదిరగడంతో కోచ్‌గా వైదొలిగిన డిడియర్ డెస్చాంప్స్ స్థానంలో జిదానే మార్గనిర్దేశం చేయనున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ కోచ్‌గా డిడియర్ డెస్చాంప్స్ ప్రస్థానం ముగిసింది. 14 ఏళ్లుగా కోచ్ బాధ్యతలు నిర్వర్తించిన అతడి స్థానంలో వెటరన్ ఆటగాడు జినెదినె జిదానే నియమితులయ్యాడు. 1998ల మొదటిసారి వరల్డ్‌కప్ గెలుపొందిన జట్టులో డెస్చాంప్స్, జిదానే సభ్యులు. ఇటీవలే ముగిసిన ఫిఫా వరల్డ్‌కప్‌లో కిలియన్ ఎంబాపే సారథ్యంలోని ఫ్రాన్స్ సెమీస్‌లో స్పెయిన్ చేతిలో చిత్తుగా ఓడింది. ఆ పరాజయంతో కోచ్ పదవిని వదులుకున్నాడు డిడియర్. దాంతో, తదుపరి కోచ్‌గా మాజీ కెప్టెన్ జినెదినే జిదానే ఎంపికయ్యాడు.



# షాట్‌పుట్‌లో స్వర్ణం

## తొలి పారా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించిన షర్మిల!

**గ్లాస్గో :** కామన్వెల్త్ క్రీడల్లో ఆరోరోజు భారత బృందం పతకాల వేట కొనసాగించింది. వెయిట్‌లిఫ్టర్ల స్ఫూర్తితో పారా అథ్లెట్ షర్మిలా ధన్కర్ మహిళల షాట్‌పుట్ విభాగంలో స్వర్ణంతో చరిత్ర సృష్టించింది. కామన్వెల్త్‌లో పసిడి పతకం కొల్లగొట్టిన మొట్టమొదటి పారా అథ్లెట్‌గా షర్మిలా రికార్డు నెలకొల్పింది. అది కూడా 40 ఏళ్ల వయసులో. పేదింటి బిడ్డగా.. అడుగడుగున కష్టాలు చవిచూసిన షర్మిల పోడియం మీద గోల్డ్‌మెడల్ అందుకొని.. చేతిలో మువ్వన్నెల జెండాతో యావత్ భారతం గర్వపడేలా చేసింది. గ్లాస్గో ఆతిథ్యమిస్తున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత పారా అథ్లెట్ షర్మిలా ధన్కర్ కొత్త అధ్యాయం లిఖించింది. స్వర్ణం గెలుపొందిన ఆమె.. ఈఘనత సాధించిన తొలి పారా అథ్లెటిక్‌గా చరిత్ర సృష్టించింది. మంగళవారం జరిగిన మహిళల పారా షాట్‌పుట్ పోటీల్లో షర్మిల ఇనుపగుండును ఏకంగా 9.81 మీటర్ల దూరం విసిరింది. మరెవరూ ఆమెను అందుకోకపోవడంతో గోల్డ్ మెడల్ ఖాయమైంది. దాంతో, కామన్వెల్త్ క్రీడల చరిత్రలో పసిడి పతకం సాధించిన మొట్టమొదటి పారా అథ్లెట్‌గా అవతరించింది.

# మాన్యకు 4 స్వర్ణాలు



**హైదరాబాద్, ఆట ప్రతినిధి :** ఏపీ, తెలంగాణ రీజియన్ సీఐఎస్‌సీఈ గేమ్స్, స్పోర్ట్స్ లెవెల్ జిమ్నాస్టిక్స్‌లో హైదరాబాద్ జిమ్నాస్ట్ మాన్య జోయ్స్ 4 స్వర్ణాలతో సత్తా చాటింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన పోటీల్లో మాన్య అండర్-14 విభాగం హూప్, బాల్, క్లబ్స్, రిబ్బన్ ఆపరేటస్ పోటీల్లో విజేతగా నిలిచింది. రిథమిక్ ఆల్‌రౌండ్ విభాగంలో టాప్ ప్లేస్ సాధించి నేషనల్స్‌కు కూడా ఎంపికైంది. మరో జిమ్నాస్ట్ నైషా హూబ్, బాల్ ఆపరేటస్ పోటీల్లో రజతాలు కైవసం చేసుకుంది.

# మరోసారి పాక్ చిత్తు..

# సిరీస్ శ్రీలంక వశం



శ్రీలంక మహిళల జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను పర్యాటక పాకిస్తాన్ జట్టు 1-2 తేడాతో కోల్పోయింది. హంబన్‌తోట వేదికగా ఇవాళ (జులై 28) జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 40 ఓవర్లలో 187 పరుగులకే చాపచుట్టేయగా.. శ్రీలంక 37.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సిరీస్ తొలి మ్యాచ్ పాక్ గెలవగా.. రెండు, మూడు మ్యాచ్‌లను గెలిచిన శ్రీలంక సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇరు జట్ల మధ్య జులై 31, ఆగస్ట్ 2, 4 తేదీల్లో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరుగనుంది.

### చెలరేగిన లంక బౌలర్లు

టాస్ ఓడి తొలుత బౌలింగ్ చేసిన శ్రీలంక పాక్‌ను స్వల్ప స్కోర్‌కే మట్టికరిపించింది. చేతన విముక్తి (3-36), కెప్టెన్ చమారీ (3-27), కవిష దిల్హారి (3-27) చెలరేగి బౌలింగ్ చేశారు. పాక ఇన్నింగ్స్‌లో 41 పరుగులు చేసిన ఫాతిమా సనా టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిగతా ప్లేయర్లలో గుల్ ఫెరోజా (40), మునీబా అలీ (34), నజిహా అల్వి (30) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు.అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో లంక బ్యాటర్లు కూడా సత్తా చాటారు. చమారీ ఆటపట్టు (52), హాసిని పెరీరా (50 నాటౌట్), హర్షిత సమరవిక్రమ (71 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి, తమ జట్టును విజయతీరాలకు చేర్చారు. వీరి ఇన్నింగ్స్‌లో విష్మి గౌతమ్ (12) మాత్రమే తక్కువ స్కోర్‌కు ఔటైంది.

# 5 మెయిడిన్లు.. 5 వికెట్లు

## పాక్‌ను దెబ్బతీసిన జస్టిన్ గ్రీవ్స్



**తారౌబా:** పాకిస్థాన్‌తో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో.. వెస్టిండీస్ బౌలర్ జస్టిన్ గ్రీవ్స్ సత్తా చాటాడు. అతను వరుసగా అయిదు ఓవర్లు వేసి.. అయిదు వికెట్లు తీసుకున్నాడు. ఆ ఓవర్లలో ఒక్క పరుగు ఇవ్వకుండా మెయిడిన్స్ వేశాడు. తారౌబాలో జరుగుతున్న తొలి టెస్టులో.. పాక్ తన తొలి ఇన్నింగ్స్‌లో 282 రన్స్‌కు ఆలౌటైంది. మూడో రోజు మొత్తం 14 వికెట్లు పడ్డాయి. పాకిస్థాన్ బౌలర్ అబ్బాస్ నాలుగు వికెట్లు తీయడంతో వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్ ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 126 రన్స్ మాత్రమే చేసింది. ప్రస్తుతం వెస్టిండీస్ 155 పరుగుల ఆధిక్యంలో ఉన్నది. పాక్ బ్యాటర్ మసూద్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ నమోదు చేశాడు. 64 నుంచి 72 ఓవర్ల మధ్య గ్రీవ్స్ అయిదు ఓవర్లలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 5 వికెట్లు తీసుకున్నాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అయిదు మెయిడిన్లు వేసిన అయిదు వికెట్లు తీయడంతో ఇదే తొలిసారి. గతంలో స్టువార్ట్ బ్రాడ్ ఓ సారి వరుసగా 4 ఓవర్లు వేసి 4 వికెట్లు తీసుకున్నాడు. ఇప్పుడు అతని రికార్డును గ్రీవ్స్ బ్రేక్ చేశాడు.



# ‘మిస్ హైదరాబాద్’ నుంచి హీరోయిన్ వరకు..

## తన సినీ ప్రయాణం చెప్పిన శ్రీ గౌరీ ప్రియ

**హైదరాబాద్, జూలై 28:** ‘చెన్నై లవ్ స్టోరీ’ సినిమాతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ తన సినీ ప్రయాణం, చదువు, సంగీతంపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ టీవీ యాంకర్‌గా పనిచేయలేదని, చిన్నప్పటి నుంచే కర్ణాటక సంగీతం, లలిత సంగీతం నేర్చుకుంటూ పెరిగానని చెప్పారు. ప్రొఫెషనల్ సింగర్ కాకపోయినా పలు రియాలిటీ షోలలో పాల్గొన్నానని, వాటి ద్వారానే వినోద రంగంపై అవగాహన పెరిగిందన్నారు. 2018లో ‘మిస్ హైదరాబాద్’ టైటిల్ గెలుచుకోవడం తన జీవితంలో కీలక మలుపుగా నిలిచిందని, అయితే కరోనా కారణంగా రెండేళ్ల పాటు అవకాశాలు ఆలస్యమయ్యాయని తెలిపారు. కోవిడ్ సమయంలో ఆహాలో విడుదలైన ‘మెయిల్’ వెబ్‌సిరీస్‌తో తనకు తొలి నటిగా అవకాశం వచ్చిందని, అక్కడి నుంచి వరుసగా సినిమాల్లో అవకాశాలు లభించాయని చెప్పారు. హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (బీమ్) పూర్తి చేశానని, మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ అంశాలపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందన్నారు. హీరోయిన్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదని, జీవితంలో ఎలాంటి అవకాశాలు వస్తాయో ముందుగా చెప్పలేమని శ్రీ గౌరీ ప్రియ పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే చదువుతో పాటు ఒక అదనపు నైపుణ్యం ఉండాలని తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో సంగీతం నేర్చుకున్నానని చెప్పారు. డిబేట్స్, ఎలక్యూషన్స్, డ్యాన్స్, క్రీడలు వంటి ప్రతి పోటీలో పాల్గొనేదానినని, అందువల్లే స్టేజ్ ఫియర్ ఎప్పుడూ రాలేదని తెలిపారు. పాల్గొనడమే ముఖ్యమనే భావన చిన్నతనం నుంచే అలవడిందన్నారు. భవిష్యత్తులో సినిమాల్లో పాట పాడే అవకాశం వస్తే తప్పకుండా పరిశీలిస్తానని, అయితే అది దర్శకులు, నిర్మాతల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని శ్రీ గౌరీ ప్రియ ఆశాభావం వ్యక్తం చేశారు.



# ‘ఆదర్శ కుటుంబం’లో నివేదా పేతురాజ్..

## స్పెషల్ గ్లింప్స్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం’ సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, “ఆడది అంటే ఇలా నవ్వాలి” అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి “ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం” అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది. ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.





# ఎవరూ నమ్మకండి

రిజర్వేషన్ల అంశంపై తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు పూర్తిగా అబద్ధమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నటి శిల్పా శెట్టి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తన పేరును ఉపయోగిస్తూ కొందరు కావాలని నిందలు వేస్తున్నారని, అది పూర్తిగా కల్పితమైన వార్త అని స్పష్టం చేశారు. నా పేరును ఉపయోగిస్తూ రిజర్వేషన్లపై వైరల్ అవుతున్న తప్పుడు ప్రకటనలు చూసి తీవ్ర షాక్‌కు గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం, దుర్బుద్ధితో కూడిన చెత్త ప్రచారం. ఇలాంటి ఫేక్ న్యూస్‌ను ఎవరూ నమ్మకండి అంటూ శిల్పా రాసుకొచ్చింది. రిజర్వేషన్ వ్యవస్థను ఉద్దేశించి వైద్యులు, కులాల ఆధారంగా రోగులకు చికిత్స చేయాలంటూ శిల్పా శెట్టి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టినట్లుగా ఒక స్క్రీన్‌షాట్ నెట్టింట తీవ్ర కలకలం రేపింది. అయితే ఈ వివాదం ముదరకముందే శిల్పా స్పందించి ఆ వార్తలకు తెరదించింది. ఇక సినిమాల విషయానికొస్తే, శిల్పా శెట్టి ఇటీవల ధ్రువ సర్జా, సంజయ్ దత్, రవిచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ’కేడీ: ది డెవిల్’ అనే కన్నడ చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె ’మా హై నా’ అనే ప్రముఖ రియాలిటీ కుకింగ్ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com